క్లుప్తంగా

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

నిర్మల్ ఖిల్లా: పీఆర్టీయూ 2024 క్యాలెండర్‌ను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట నరేంద్రబాబు, రమణారావు తమ సంఘం సభ్యులతో కలిసి కలెక్టర్‌ను నిర్మల్‌లో కలిశారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లాలోని ఆయా మండలాల పీఆర్టీయూ బాధ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

లోకేశ్వరం: మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో యూరియా అందుబాటులో ఉందని పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాగు ధర రూ.270 ఉందని.. అవసరమైన రైతులు పీఏసీఎస్ కార్యాలయానికి పట్టాదారు పాస్‌బుక్‌లు, ఆధార్, బ్యాంకు ఖాతా జిరాక్స్‌లతో వచ్చి యూరియా తీసుకెళ్లాలని సూచించారు.

సత్ప్రవర్తనతో జీవనం సాగించాలి



పాతనేరస్తులతో మాట్లాడుతున్న సీఐ నైలు

కుంటాల: పాత నేరస్తులు సత్ప్రవర్తనతో జీవనం సాగించాలని భైంసా రూరల్ సీఐ నైలు నాయక్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో సోమవారం పాత నేరస్తులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. దొంగతనాలు, దోపిడీలకు పాల్పడితే వచ్చే అనర్థాలను వివరించారు. కుటుంబసభ్యులతో కలిసి మెలిసి ఉండాలని సూచించారు. సమావేశంలో ఎస్సై హన్మండ్లు, సిబ్బంది రాందాస్, దేవ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగం

లక్ష్మణచాంద: మండలంలోని పీచర గ్రామంలో అల్లె రాజేశ్వర్ చేనులో వేరుశనగ పంట ప్రయోగం నిర్వహించినట్లు ఏఈవో పవిత్ర అన్నారు. ఎకరాకు 14 నుంచి 15 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చినట్లు వారు పేర్కొన్నారు. రైతులు వ్యవసాయాధికారుల సూచనల మేరకు చేనులో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాజేశ్వర్, ఎంపీఎస్‌వో నరేశ్, వీడీసీ సభ్యులు భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే విజయం

భైంసాటౌన్: విద్యార్థులు ఒత్తిడికి గురవకుండా పట్టుదల, ప్రణాళికతో చదివితే లక్ష్యం చేరుకుంటారని భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి అన్నారు. ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్‌నేషనల్ ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం వ్యక్తిత్వ వికాసంపై పది, ఇంటర్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సంస్థకు చెందిన జగన్ గురూజీ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. ఫోన్‌కు దూరం ఉండి.. సమయం వృథా చేయకుండా కేవలం చదువుపై మాత్రమే దృష్టి సారించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేవీ ప్రదీప్, శ్యాంరాథోడ్ తదితరులు ఉన్నారు.

వేధిస్తే ఫిర్యాదు చేయండి

నిర్మల్‌టౌన్: వేధిస్తే ఆందోళన చెందకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని షీటీం ఎస్సై సుమాంజలి పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వశిష్ఠ డిగ్రీ కళాశాల విద్యార్థులకు, ప్రయాణికులకు బస్టాండ్‌లో షీటీం బృందం ఆధ్వర్యంలో పలు అంశాలు వివరించారు. 100కు డయల్, సీసీ కెమెరాలతో లాభాలు, బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, కమ్యూనిటీ పోలీసింగ్, మానవ అక్రమ రవాణా, మద్యపాన నిషేధం, ఆన్‌లైన్ మోసాలు, గంజాయి నిర్మూలన, డ్రగ్స్ నిషేధం, టోల్‌ఫ్రీ నెంబర్ 1930 వంటి అంశాలపై అవగాహన కల్పించారు. షీ టీం ఎమర్జెన్సీ నెంబర్ 87126 59550కు ఫోన్ చేయాలని సూచించారు. ఇందులో ఉపాధ్యాయులు, విద్యార్థులు, షీటీం పోలీసులు ఉన్నారు.

అదనపు కలెక్టర్‌కు వినతి

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్‌లోని మంజులాపూర్ జెడ్పీ జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు వెంటనే మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌కు ధర్మ సమాజ్ పార్టీ ప్రచార కమిటీ సభ్యులు రామగిరి రవీందర్ ఫిర్యాదు చేశారు. మన ఊరు–మనబడిలో భాగంగా పాఠశాలకు నూతన భవనాలు, మరుగుదొడ్లు మంజూరు కావడంతో పాతవి కూల్చేశారని పేర్కొన్నారు. ఆ పార్టీ నాయకులు కల్లూర్ సుధాకర్ పాల్గొన్నారు.

‘సేంద్రియం’తో ఆదాయం

- తక్కువ ధరకే గ్రామాల్లోని రైతులకు విక్రయం
- ఆదాయం సమకూర్చుకుంటున్న పంచాయతీలు



అంబకంటితండాలో పరిశీలిస్తున్న రైతులు



కుంటాలలో సేంద్రియ ఎరువు తయారు చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కుంటాల: ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్లు పంచాయతీలకు ఆదాయ వనరులుగా మారుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పరిశుభ్రతకు పెద్దపీట వేసి ప్రతి గ్రామపంచాయతీలో డంపింగ్ యార్డుతోపాటు సేంద్రియ ఎరువులను తయారు చేసే సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించింది. పంచాయతీ ట్రాక్టర్ ద్వారా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి డంపింగ్‌యార్డుకు తరలిస్తారు. అక్కడ పారిశుధ్య కార్మికులు తడి, పొడి చెత్తను వేరు చేసి సేంద్రియ(వర్మీకంపోస్టు) ఎరువు తయారు చేస్తారు. ఈ ఎరువును రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూరుతుంది. దీనిని చల్లడం ద్వారా వ్యవసాయ భూములు సారవంతంగా మారి అధిక దిగుబడులు పొందుతున్నట్లు రైతులు పేర్కొన్నారు.

తయారీ విధానం ఇలా..

సెగ్రిగేషన్ షెడ్డు అరలో రెండు ఇంచుల మేర పొడి చెత్త, నల్లరేగడి మట్టి, ఎండు ఆకులు వేయాలి. తర్వాత పశువుల పేడ, నీళ్లు చల్లి గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను ఆహార వ్యర్థాలతో కలిపి వానపాములను వేస్తారు. పైనుంచి తట్టు సంచులు వేసి పారిశుధ్య కార్మికులు ఉదయం, సాయంత్రం నీళ్లు చల్లుతారు. వానపాములు కుళ్లిన చెత్తను తింటున్నకొద్దీ అందులో ఉన్న చెత్త అంతా పొడిలాగా తయారవుతోంది. 45 నుంచి 60 రోజుల నిల్వ తర్వాత ఇది సేంద్రియ ఎరువుగా మారుతుంది. సేంద్రియ(వర్మీకంపోస్టు)ఎరువు నాణ్యతను బట్టి కిలోకు రూ.10 నుంచి రూ.40వరకు చొప్పున రైతులకు విక్రయిస్తారు.

పంచాయతీల వారీగా వివరాలు..

కుంటాల మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో గతేడాది వర్మీ కంపోస్ట్ తయారీకి శ్రీకారం చుట్టారు. వానపాములు, పంట మిగులు అవశేషాలు, కూరగాయల వ్యర్థాలతో దీనిని తయారు చేస్తున్నారు. అంబకంటి గ్రామంలో 264కిలోలు, అంబకంటి తండాలో249 కిలోలు, అంబుగామలో 304 కిలోలు, అందాకూర్‌లో 311కిలోలు, దౌనెల్లిలో 268 కిలోలు, కల్లూర్‌లో 390కిలోలు, కుంటాలలో 984కిలోలు, లింబా(కె)లో 371కిలోలు, లింబా(బి)లో 339కిలోలు, మెదన్‌పూర్‌లో 263 కిలోలు, ఓలాలో 439కిలోలు, పెంచికల్‌పాడ్‌లో 291 కిలోలు, సూర్యాపూర్‌లో 223 కిలోలు, వెంకూర్‌లో 187కిలోలు, విఠాపూర్‌లో102 కిలోల వర్మీ కంపోస్టు ఎరువును అధికారులు తయారు చేయించారు. మొత్తం 49 క్వింటాళ్ల 85 కిలోలు తయారు చేయగా.. 285 కిలోలను హరితహారం మొక్కలకు వినియోగించగా అవి ఏపుగా పెరుగుతున్నాయి. దీంతో ఇప్పటివరకు పంచాయతీలకు సుమారు రూ.30 వేల వరకు ఆదాయం వర్మీకంపోస్టు విక్రయించడం వల్ల వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.

కొనుగోలుకు రైతుల ఆసక్తి..

సెగ్రిగేషన్ షెడ్లులో తయారు చేసే సేంద్రియ ఎరువులను భూముల్లో చల్లడం సారవంతంగా మారుతున్నాయి. దీంతో కొనేందుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. మరోవైపు వర్మీకంపోస్ట్ తక్కువ ధరకు లభిస్తుంది. ఈ ఎరువును చల్లడం ద్వారా దిగుబడులు పెరిగనట్లు రైతులు పేర్కొంటున్నారు.

రెండు క్వింటాళ్లు కొన్న



వర్మీకంపోస్టు ప్రయోజనాలు తెలిసినాకా.. రెండు క్వింటాళ్లు కొని చేనులో చల్లా. ప్రస్తుతం అందులో సాగు చేసిన ఆయిల్‌పాం, మిర్చి పంటలకు తెగుళ్ల బెడద తప్పింది. ఇతర ఎరువులు కూడా తక్కువ అవసరం అవుతున్నాయి.
– జుట్టు విజయ్, కుంటాల

దిగుబడులు పెరిగాయి



నాకున్న రెండెకరాల్లో కూరగాయలు పండిస్తున్న. వర్మీకంపోస్ట్ వినియోగంపై అధికారులు అవగాహన కల్పించారు. కూరగాయల తోటల్లో వర్మీ కంపోస్ట్ వేయడం ద్వారా దిగుబడులు పెరిగాయి. రసాయన ఎరువుల వినియోగం కూడా తగ్గింది.
– రాథోడ్ కాంతాబాయి, రాయపాడ్ తండా

ప్రయోజనాలు వివరిస్తున్నాం



గ్రామపంచాయతీల్లో సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసి.. పంచాయతీ కార్యదర్శుల సహకారంతో వర్మీ కంపోస్ట్ తయారు చేయిస్తున్నాం. ఇది చల్లితే కలిగే ప్రయోజనాలను వివరిస్తుండటంతో కొనేందుకు రైతులు ముందుకొస్తున్నారు. దీంతో పంచాయతీలకు ఆదాయం సమకూరుతుంది.
– రహీం, ఎంపీవో

మంత్రి, స్పీకర్‌ను కలిసిన సామాజిక కార్యకర్త



సీతక్కకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సయ్యద్ కలీం

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త సయ్యద్ కలీం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, పంచాయతీ రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కను సోమవారం కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

పంటల వివరాలు నమోదు చేయించుకోవాలి

లక్ష్మణచాంద: మండలంలోని గ్రామాల్లో యాసంగిలో సాగు చేస్తున్న పంటల వివరాలను రైతులు తమ క్లస్టర్ పరిధిలోని ఏఈవోల వద్ద నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చామన్‌పెల్లి గ్రామంలో ఏఈఓ ఉమామహేశ్వరి క్షేత్రస్థాయిలో పంటలు నమోదు చేసుకోగా.. ఏవో పరిశీలించారు. పంటల వివరాలు నమోదు చేయించుకోకుంటే ధాన్యం విక్రయించే సమయంలో రైతులు ఇబ్బందులు పడతారని పేర్కొన్నారు.

పునరావాస భూముల సర్వే

కడెం: పునరావాసంలో భాగంగా రాంపూర్, మైసంపేట్ గ్రామస్తులకు అందించేందుకు నచ్చన్‌ఎల్లాపూర్ పంచాయతీ పరిధిలోని పెత్తర్పు సమీపంలో వ్యవసాయ భూములను సర్వే చేస్తున్నట్లు ఎఫ్‌ఆర్వో చోలే అనిత తెలిపారు. పునరావాస ప్యాకేజీలో భాగంగా 94 కుటుంబాలకు 2.32 ఎకరాల చొప్పున వ్యవసాయ భూమి ఇవ్వనున్నట్లు ఎఫ్ఆర్వో పేర్కొన్నారు.

లౌకికశక్తులు ఏకం కావాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు జ్యోతి



ప్లీనరీ సమావేశంలో మాట్లాడుతున్న టి. జ్యోతి

నిర్మల్‌చైన్‌గేట్: దేశంలో మతోన్మాద బీజేపీని నిలువరించేందుకు లౌకిక శక్తులు ఏకం కావాలని, పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీని ఓడించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు టి.జ్యోతి కోరారు. సీపీఎం జిల్లా ప్లీనరీ సమావేశం సోమవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్, బానోతు సుజాత అధ్యక్షతన నిర్వహించిన ప్లీనరీకి జ్యోతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ ప్రజల మధ్య మత వైశ్యమ్యాలు సృష్టించి రాజకీయలబ్ధి పొందాలని చూస్తోందన్నారు. ప్రభుత్వ రంగసంస్థలను అమ్మివేసి దేశ సంపాదను అదాని, అంబానీకు దోచి పెట్టిందని ఆరోపించారు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించి నిరుద్యోగులను మోసం చేసిందని తెలిపారు. జమిలీ ఎన్నికలు నిర్వహించేందుకు మోదీ ప్రభుత్వం యత్నిస్తుందని.. జమిలీ ఎన్నికలు అంటే పార్లమెంటరీ ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బ తీయడమే అవుతుందని తెలిపారు. దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బిల్కిస్ భానుపై లైంగిక దాడి చేసిన నిందితులకు గుజరాత్ ప్రభుత్వం ప్రకటించిన క్షమాభిక్షను సుప్రీం కోర్టు కొట్టివేసిందని తెలిపారు. ఇది బీజేపీ ప్రభుత్వానికి చెంప పెట్టులాంటిదన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.అడివయ్య, ఆర్.అరుణజ్యోతి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. పార్టీ జిల్లా కార్యదర్శి గౌతమ్‌కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్‌కుమార్, బొమ్మెన సురేశ్, బి.సుజాత, జిల్లా కమిటీ సభ్యులు డాకూర్ తిరుపతి, తొడసం శంభు, ఇప్ప లక్ష్మణ్, గంగమణి, పసివుద్దీన్, పోశెట్టి, వెస్లీ, రాజమణి, భరత్‌బాయి, మురళి, పోశెట్టి, అతిక్ పాల్గొన్నారు.

‘బీజేపీ అభ్యర్థిని గెలిపించుకుందాం’



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్

కడెం: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీగా బీజేపీ అభ్యర్థిని గెలిపించుకుందామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని హరిత రిసార్ట్స్‌లో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో రెండు ఎమ్మెల్యే స్థానాలను బీజేపీ అభ్యర్థులు గెలుచుకున్నారని పేర్కొన్నారు. ఖానాపూర్‌లో నియోజవర్గంలోనూ స్వల్ప తేడాతో రమేశ్‌రాథోడ్ ఓటమి పాలయ్యారని అన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలెవరూ అధైర్యపడొద్దని.. కలిసికట్టుగా పని చేసి బీజేపీ ఎంపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అంతకుముందు గంగాపూర్‌లో వికసిత్ భారత్ సంకల్ప్‌యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు, రవీందర్‌రెడ్డి, రవీందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

మానవ అక్రమ రవాణా అరికట్టాలి



జ్యోతి వెలిగిస్తున్న అధికారులు

ఖానాపూర్: మానవ అక్రమ రవాణాను అరికట్టడం అందరి బాధ్యత అని ఐసీడీఎస్ సీడీపీవో సరిత, ప్రజ్వల ఎన్జీవో కో–ఆర్డినేటర్ శ్రావ్యశృతి అన్నారు. సోమవారం పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో ‘ప్రజ్వల’ ఆధ్వర్యంలో ఖానాపూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్ల అవగాహన సదస్సులో మాట్లాడారు. యువత మొబైల్, ఇంటర్‌నెట్ కారణంగా సైబర్ మోసాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. అపరిచితులు ఫోన్ చేసి బ్యాంకు, వ్యక్తిగత వివరాలు అడిగితే చెప్పవద్దన్నారు. అనుమానితులు కన్పిస్తే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు సంప్రదించాలన్నారు. అక్రమ రవాణాను అరికట్టడంలో ప్రతీ గ్రామంలో కమ్యూనిటీ విజిలెంట్ గ్రూపులు ఏర్పాటుచేయాలని సూచించారు. సూపర్‌వైజర్ శ్రీలత, సురేశ్‌కుమార్, అసిస్టెంట్ కోఆర్డినేటర్లు శివ, అనిల్, తదితరులు ఉన్నారు.

తప్పులు లేకుండా నమోదు చేయాలి

- జెడ్పీ సీఈవో సుధీర్‌కుమార్



లోకేశ్వరంలో పరిశీలిస్తున్న సుధీర్‌కుమార్

లోకేశ్వరం: అభయహస్తం దరఖాస్తులను తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జెడ్పీ సీఈవో సుధీర్‌కుమార్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదును సోమవారం పరిశీలించారు. గడువులోగా అభయహస్తం దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలన్నారు. వారు వచ్చిన సమయంలో కరెంటు లేకపోవడంతో విద్యుత్ అధికారులతో ఫోన్ మాట్లాడి సరఫరా పునరుద్ధరింపజేశారు. దరఖాస్తుల నమోదు పూర్తయ్యే వరకు సరఫరాకు అంతరాయం కలుగకుండా చూడాలన్నారు. ఎంపీడీవో సోలమాన్‌రాజ్, ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి ఉన్నారు.

మామడ: మండల కేంద్రంలో ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను సోమవారం జెడ్పీ సీఈవో సుధీర్‌కుమార్ పరిశీలించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి శ్రీకళ, ఎంపీడీవో రమేశ్, ఎంపీఓ గోవర్ధన్ ఉన్నారు.

ఖానాపూర్‌లో డీఈవో పరిశీలన..

ఖానాపూర్: దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదును వేగవంతం చేయాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాల్లో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. గంగాధర్, స్వామి, సురేందర్, శ్రీధర్, సాగర్ తదితరులు ఉన్నారు.

రక్తహీనతపై అవగాహన

కడెం: పౌష్టికాహారం తీసుకుంటేనే రక్తహీనతను నివారించవచ్చని మిషన్‌శక్తి జెండర్ స్పెషలిస్టు జ్యోతి అన్నారు. సోమవారం మండలంలోని ఉడుంపూర్ గ్రామంలో మహిళా సాధికారత, అనిమియా సే నిర్మల్ ముక్త్‌లో భాగంగా రక్తహీనతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ సిబ్బంది గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించారు. సర్పంచ్ లక్ష్మి, ఉపసర్పంచ్ శ్రావణ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధ, హెల్త్ సూపర్‌వైజర్ ప్రేమలత తదితరులున్నారు.

ఆర్థికసాయం అందజేత

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె గ్రామానికి చెందిన కడమంచి రాజేశ్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. సోమవారం హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సభ్యులు వారి ఇంటికి వెళ్లి రూ.ఐదు వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మహేశ్, తొంటికూరి మణికంఠ, ఎల్కుల శోభన్, శివ తదితరులు ఉన్నారు.

మాణిక్‌రావు ఠాక్రేను కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఖానాపూర్: కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేను ఆ పార్టీ జిల్లా నాయకులు, పరిశ్రమల శాఖ రిటైర్డ్ జనరల్ మేనేజర్ రాంకిషన్ ఆధ్వర్యంలో సోమవారం కలిశారు. మహారాష్ట్రలోని యావత్‌మాల్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో కౌసర్ మహ్మద్, ఏరుకొండ విజయసాగర్, లక్ష్మీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అక్షింతలు పంపిణీ



భైంసా మైలాపూర్‌లో అక్షింతలతో గ్రామస్తులు

కడెం/ఖానాపూర్/కుంటాల/లోకేశ్వరం/ముధోల్/లక్ష్మణచాంద/భైంసా: కడెం మండలంలోని కొండుకూర్‌లో సోమవారం అయోధ్య రాములోరి అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు ఖానాపూర్ మండలం పాతఎల్లాపూర్, బాదనకుర్తి, దిలావార్‌పూర్ గ్రామాల్లో హిందూ వాహిని, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో అక్షింతల శోభాయాత్ర నిర్వహించారు. కుంటాలలో అక్షింతలను, కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. లోకేశ్వరం మండలం హథ్‌గాంలో ,ముధోల్ మండలంలోని ముద్గల్ గ్రామంలో రాములోరి అక్షింతలు పంపిణీ చేశారు. లక్ష్మణచాంద మండలంలోని చామన్‌పెల్లి, బోరిగాం తదితర గ్రామాల్లో రాములోరి అక్షింతలను వీడీసీల ఆధ్వర్యంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. బాసర మండలంలోని మైలాపూర్‌లో అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు.

నేటి నుంచి నానూ మహరాజ్ జాతర

సారంగపూర్: మండలంలోని పొట్య పంచాయతీ పరిధిలోని బండరేవు తండాలో కొలువుదీరిన గిరిజనుల ఆరాధ్యదైవం నానూ మహరాజ్ జాతర వేడుకలను మంగళవారం నుంచి ఈనెల 13వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారి జాదవ్ మంగీలాల్ తెలిపారు. వేడుకల్లో భాగంగా నానూమహరాజ్, జగదాంబదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి జాతర ప్రారంభిస్తామని పేర్కొన్నారు. 9న క్రికెట్ పోటీలు, 10న వాలీబాల్, 11న కబడ్డీ, 12న ముగ్గుల పోటీలు, 13న క్రికెట్ ఫైనల్, ప్రత్యేక ఆకర్షణగా నిలిచే కుస్తీ, స్లోసైకిల్ తదితర పోటీలు నిర్వహించనున్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ప్రవేశ రుసుం చెల్లించి ఆలయ కమిటీ వద్ద పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. రోజు రాత్రి భజన, సంకీర్తనలు, పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తామని.. భక్తులు ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లు చేశామని సిబ్బంది పేర్కొన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీలో బీఆర్‌ఎస్ పాత్ర లేదు

- రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి
- మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి



రిజిస్ట్రేషన్ పేపర్లను మీడియాకు చూపుతున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

నిర్మల్‌టౌన్: దిలావర్‌పూర్ – గుండంపల్లి గ్రామాల మధ్య ఏర్పాటు చేసే ఇథనాల్ ఫ్యాక్టరీకి అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో సోమవారం మాట్లాడారు. ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దు చేయాలని రైతులు చేస్తున్న ఆందోళనకు మద్దతు తెలిపారు. రైతులపై లాఠీచార్జిని ఖండించారు. రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కేంద్రమే అనుమతి ఇచ్చిందని తెలిపారు. అనుమతికి ముందు తమను గానీ, రైతులను గానీ అధికారులు సంప్రదించలేదన్నారు. అటవీ, పర్యావరణ, వాతావరణ మార్పుల శాఖ ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించకుండా నేరుగా అనుమతులు ఇచ్చిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ అనుమతుల ఆధారంగానే రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అనుమతి ఇచ్చిందని వెల్లడించారు.

ఎమ్మెల్యే అనుచరులే భూమిపూజ చేశారు.

ఎన్నికల తర్వాత ఇథనాల్ ఫ్యాక్టరీ పనులు ఎందుకు ప్రారంభించారో అధికార కాంగ్రెస్ నేతలు, స్థానిక బీజేపీ ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దీని వెనుక ఎవరు.. ఉన్నారో రైతులు గ్రహించాలని కోరారు. నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ప్రధాన అనుచరులు తక్కల రమణారెడ్డి, దిలావర్‌పూర్ సర్పంచ్ జంగం వీరేశం, సత్యం చంద్రకాంత్ (పీఏ), ముత్యంరెడ్డి, ఎలేటి చిన్న నర్సారెడ్డితోపాటు మరికొంత మంది మహేశ్వర్‌రెడ్డి అనుచరులు ఫ్యాక్టరీకి భూమిపూజ చేశారని వివరించారు. ఇథనాల్ ఫ్యాక్టరీ గుండపల్లిలో ఏర్పాటు చేయడానికి మహేశ్వర్‌రెడ్డి, ఆయన అనుచరులే సహకరించారని తెలిపారు. పరిశ్రమ పనులు తరలించే వరకూ రైతులకు అండగా ఉంటామని ప్రకటించారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, నాయకులు రామ్ కిషన్‌రెడ్డి, డాక్టర్ సుభాష్‌రావు, వెంకటరమణారెడ్డి, రాము, తదితరులు పాల్గొన్నారు.

‘ప్రచారానికే పరిమితమైన కాంగ్రెస్ ప్రభుత్వం’



వద్యాల్‌లో మాట్లాడుతున్న రావుల రాంనాథ్

లక్ష్మణచాంద: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరిట ప్రచార ఆర్భాటాలకే పరిమితమైందని బీజేపీ పెద్దపల్లి జిల్లా ఇన్‌చార్జి రావుల రాంనాథ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వద్యాల్ గ్రామంలో ఆ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి రాగానే రుణమాఫీ, రైతుబంధు డబ్బులు జమ చేస్తామని చెప్పి నెల రోజులు గడిచినప్పటికీ.. హామీలు అమలు చేయలేదని విమర్శించారు. గతంలో కాళేశ్వరం అవినీతిపై సీబీఐ విచారణ కోరిన రేవంత్‌రెడ్డి.. ముఖ్యమంత్రి అయిన తర్వాత జ్యుడీషియల్ విచారణ మాత్రమే చేస్తామనడం కేసీఆర్‌తో కుమ్మక్కయ్యారనడానికి నిదర్శనమన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకొని ప్రజలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. హామీలు అమలు చేసే వరకు ప్రజల పక్షాన ప్రభుత్వంపై పోరాటం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు రాచకొండ సాగర్, బీజేపీ మండల అధ్యక్షుడు గోవర్ధన్, అల్లూరి రాజు, మోహన్, మల్లేశ్, నారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులు పట్టుదలతో చదవాలి

- డీఈవో రవీందర్‌రెడ్డి
- వెనుకబడ్డ వారిపై దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచన



మాట్లాడుతున్న డీఈవో రవీందర్‌రెడ్డి

కుభీర్: విద్యార్థులు పట్టుదలతో చదవాలని డీఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. కుభీర్ కస్తూరిబా, ఉన్నత పాఠశాలను సోమవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. పది ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని తెలిపారు. ఎక్కువ మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయానికి వెళ్లి అభయాస్తం దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. డీఈవో వెంట పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.సాయన్న, సీఆర్పీలు ఆనంద్, గంగాధర్ తదితరులు ఉన్నారు.